సాక్షి మెదక్

శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023



తల్లీబిడ్డల సంరక్షణే లక్ష్యం

చిన్నారుల ఎదుగుదల, గర్భిణులు, బాలింతల పోషకాహారం, పెరటి తోటల పెంపకం, తదితర అంశాలపై ఐసీడీఎస్ అధికారులు ప్రచారం చేస్తున్నారు. వివరాలు 10లో ▸



ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా సమన్వయంతో పనిచేయాలని సిద్దిపేట సీపీ శ్వేత పోలీసు అధికారులకు సూచించారు. వివరాలు 10లో ▸

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: పట్టణంలోని జమ్మికుంట మినీ గురుకులంలో పీఈటీ, వంట మనిషి పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. పీఈటీకి డిగ్రీ, బీపీఎడ్, వంటమనిషి కోసం పదో తరగతి పూర్తి చేసిన గిరిజన మహిళలు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 30లోపు దరఖాస్తులను సమర్పించాలన్నారు.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



హరిత

హవేళిఘణాపూర్(మెదక్): సంగారెడ్డి అంబేడ్కర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో హవేళిఘణాపూర్ మండల విద్యార్థిని ప్రతిభ కనబర్చింది. మహాత్మా జ్యోతారావు పూలే రెసిడెన్షియల్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న హరిత రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రజిని తెలిపారు.

సద్దుల పండుగతో నిరసన



నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

మెదక్ కలెక్టరేట్: రెగ్యులరైజ్ చేయాలంటూ సమగ్ర శిక్షా ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద చేస్తున్న దీక్ష గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా సద్దుల పండుగ నిర్వహించారు. సామూహిక పంక్తి భోజనంలో ఒక్కొక్కరు ఒక్కోరకమైన అల్పాహారం తింటూ.. నిరసన తెలిపారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే వరకు కార్యక్రమాలు ఆపేది లేదని ఉద్యోగులు స్పష్టం చేశారు. వీరికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌తో, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. జేఏసీ నాయకులు, అన్ని వింగ్‌ల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైద్యసేవలు మెరుగుపడాలి



కన్నారంలో వైద్యసేవలను పరిశీలిస్తున్న డాక్టర్ లక్ష్మణ్

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాల్లో వైద్యకేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డబ్ల్యూహెచ్‌ఓ (వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్) మానిటర్ డాక్టర్ లక్ష్మణ్ సూచించారు. గురువారం మండలంలోని మహ్మద్‌నగర్, కొట్టాల పంచాయతీలో కొనసాగుతున్న వ్యాక్సినేషన్, ఏఎన్‌ఎంలు ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. పిల్లలు, పెద్దలకు ఇచ్చే రోగనిరోధక టీకాలతోపాటు, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రీకాంత్, ఎంపీహెచ్‌ఓ సురేందర్, సూపర్‌వైజర్ రమేష్, ఏఎన్‌ఎంలు మజీదాబేగం, ప్రమీళ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలి

మెదక్ కలెక్టరేట్: సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ యూనియన్‌తో ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని, సమ్మెపై నిర్బంధం తొలగించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. గురువారం మెదక్ ఆర్డీఓ కార్యాలయం వద్ద జరిగిన నిరసనలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ శాఖలతో కలిసి సమ్మె విచ్ఛిన్నం చేస్తూ బెదిరింపులు గురిచేయడం సరికాదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాలు అంగన్‌వాడీలకు మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు అనురాధ, నాగమణి, మంగ, శివలక్ష్మి పాల్గొన్నారు.

సంపద వనాలు



రామాయంపేట మండలం కోనాపూర్‌లో ఏర్పాటు చేసిన సంపద వనం

- ఇరిగేషన్ స్థలాల గుర్తింపు
- 167 ఎకరాల్లో కలప, తోటల పెంపకం
- పంచాయతీలకు భవిష్యత్ ఆదాయం

మెదక్: పచ్చదనం పెంపు లక్ష్యంగా హరితహారం కార్యక్రమం ప్రారంభించిన ప్రభుత్వం.. మండలాల్లో సంపద వనాల పెంపునకు శ్రీకారం చుట్టింది. పర్యావరణంతో పాటు విలువైన కలప, పండ్ల తోటలు పెంచి భవిష్యత్‌లో పంచాయతీలకు ఆదాయ మార్గాలుగా మార్చాలని నిర్ణయించింది. జిల్లాలో ఇరిగేషన్ పరిధిలో 167 ఎకరాలను గుర్తించి ఈజీఎస్ ఆధ్వర్యంలో వనాలు పెంపు చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని 17 మండలాల పరిధిలో ఈ వనాల పెంపు ప్రారంభించారు. 70 బ్లాకులుగా విభజించి మొక్కలను నాటుతున్నారు. ఇందులో ఇప్పటి వరకు 65 బ్లాక్‌లలో వనాల పెంపు దాదాపు పూర్తికావొచ్చింది. అల్లాదుర్గం, చేగుంట, చిలప్‌చెడ్, హవేళీఘనపూర్, కౌడిపల్లి, కొల్చారం, మనోహరాబాద్, మెదక్, నర్సాపూర్, పాపన్నపేట, రామాయంపేట, రేగోడు, చిన్నశంకరంపేట, శివ్వంపేట, టేక్మాల్, తూప్రాన్, వెల్దుర్తి మండలాల్లో ఇరిగేషన్ స్థలాల్లో ఈ వనాలు పెంచుతున్నారు. చేగుంట మండలం రెడ్డిపల్లి, నర్సాపూర్ మండలాల్లో కాళేశ్వరం కాల్వపై మూడు ఎకరాల చొప్పున స్థలాలను గుర్తించారు. కొల్చారం నుంచి ఏడుపాయల కమాన్ వద్ద, రాయినిపల్లి ప్రాజెక్టు సమీపంలో, చిలప్‌చెడ్, చిన్నశంకరంపేట గెస్ట్‌హౌస్, రామాయంపేట తదితర మండలాల్లోని గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేశారు.

జీపీలకు ఆదాయం..

గ్రామాలకు ఆదాయం సమకూర్చడంతో పాటు ఆహ్లాదకర వాతావరణం కల్పించడం సంపద వనాల ముఖ్య ఉద్దేశం. వనంలో టేకు, మద్ది, శిశు, వేప, చింత, అల్లనేరడు, ఉసిరి, చింత, వెలగ, మామిడి తదితర రకాల మొక్కలను పెంచుతారు. పెరిగిన కలపను భవిష్యత్‌లో నరికి వచ్చే ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి ఉపయోగిస్తారు. అంతేకాకుండా మొక్కల పెంపుతో వాతావరణ సమతౌల్యం సాధ్యమవుతుందని, వర్షాలు సకాలంలో కురుస్తాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం 24 శాతం మేర అటవీ ప్రాంతం ఉంది. దీనిని 34 శాతానికి పెంచడానికి ఈ వనాలు ఎంతో దోహదపడతాయి. చిన్నశంకరంపేట, నార్సింగ్, చేగుంట, శివ్వంపేట, మనోహరాబాద్ తదితర మండలాల్లో ఉన్న కంపెనీల ద్వారా గాలి, నీరు, ధ్వని కాలుష్యం ఏర్పడుతోంది. వనాల పెంపుతో ఇది కొంతవరకైనా తగ్గుతుందని పలువురు పేర్కొంటున్నారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహం పరిధిలో 30 గుంటల స్థలంలో మొక్కలను పెంచుతున్నారు.

ఎంతో ప్రయోజనం



భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని సంపద వనాలను ఏర్పాటు చేస్తున్నాం. కాలుష్య నియంత్రణకు, పచ్చదనం పెంపునకు ఈ వనాలు ఉపయోగపడతాయి. ముున్ముందు పంచాయతీలకు ఆదాయం కూడా సమకూరుతుంది. ఖాళీ స్థలాలను గుర్తించి వీటిని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాం.

– శ్రీనివాస్, డీఆర్‌డీఓ, మెదక్

ఉత్సవాల నిర్వహణకు చర్యలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, పక్కన ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, అధికారులు

- కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణపై గురువారం ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, అధికారులతో కలసి సమీక్షించారు. పర్యావరణానికి హాని చేయని మట్టి గణపతిని పూజించి చవితి వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. మట్టి విగ్రహాలతో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కాలుష్య నియంత్రణ మండలి చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు ఆర్సీపురం ఆధ్వర్యంలో రూపొందించిన మట్టి గణపతుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. పోలీస్, విద్యుత్, మున్సిపల్, తదితర శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే గణేష్ మండలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎస్పీ రోహిణి ప్రియదర్శిని మాట్లాడుతూ.. ఈ నెల 18 నుంచి 28 వరకు నిర్వహించే వినాయక ఉత్సవాలకు పోలీస్ శాఖ నుంచి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సమస్యాత్మక సెంటర్లను గుర్తించాలి

నియోజకవర్గాల్లో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. సార్వత్రిక ఎన్నికలకు సంసిద్ధంపై ఎన్నికలకు సంఘం 32 స్లైడ్స్ రూపొందించినట్లు తెలిపారు. సంబంధిత నోడల్ అధికారులు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. నోడల్ అధికారిగా తమ పరిధికి సంబంధించి అంశంపై రెండు రోజుల్లో సమగ్ర సమాచారం అందించాలని, ప్రతి కేంద్రం వెబ్ కాస్టింగ్ పరిధిలో ఉండాలన్నారు. ఎన్నికల నిర్వహణపై సందేహాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

మత్తుకు చెక్ పెట్టాలి

జిల్లాలో మత్తు పదార్థాలను కూకటివేళ్లతో పెకిలించి డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం ఎస్పీ రోహిణి ప్రియదర్శిని, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రజాక్‌తో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. జిల్లాలో నార్కోటిక్ సెల్‌ను ఏర్పాటు చేసి కేసులు త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు.

టికెట్‌పై వెనక్కి తగ్గేది లేదు

- నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్: నర్సాపూర్ టికెట్ కోసం వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇంత కాలం కష్టపడి పార్టీని కాపాడానని, నిన్న మొన్న పార్టీలోకి వచ్చిన వారికి టికెట్ ఇస్తామంటే ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. గెలుస్తం, ఓడుతం.. అదంతా దైవ నిర్ణయమని, పోటీలో మాత్రం ఉంటానని పేర్కొన్నారు. ఇటీవల మంత్రి కేటీఆర్‌ను కలిసినప్పుడు కూడా టికెట్ విషయాన్ని సీఎం కేసీఆర్ చూసుకుంటారని చెప్పారని తెలిపారు.

16న చెక్కుల పంపిణీ..

ఈ నెల 16న బీసీ బంధు పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని 350మందికి శనివారం ఉదయం 12గంటలకు సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌లో చెక్కులుం అందిస్తామని తెలిపారు. మొదటి విడతలో రానివారికి 15 రోజుల అనంతరం రెండో విడతలో మంజూరు చేస్తామన్నారు. ఆయనతో రాష్ట్ర అసంఘటిత కార్మిక బోర్డు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ రాజుయాదవ్, నాయకులు మన్సూర్, నర్సింగ్‌రావు, రమణగౌడ్, రామాగౌడ్, సుదీర్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, నగేష్, దావూద్, కృపాచారి తదితరులు పాల్గొన్నారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

- డీఈఓ రాధాకిషన్
- టెట్ నిర్వహణపై అధికారులకు సూచనలు



మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

మెదక్ కలెక్టరేట్: అధికారులు సమన్వయంతో పని చేసి టెట్‌ను పక్కాగా నిర్వహించాలని డీఈఓ రాధాకిషన్ అన్నారు. శుక్రవారం జరగబోయే టెట్‌కు సంబంధించి గురువారం కలెక్టరేట్‌లో అధికారులకు విధులు కేటాయించి, పరీక్ష సామగ్రి అందజేశారు. మెదక్‌లో 18, రామాయంపేటలో 3 కేంద్రాలు ఏర్పాటు చేసి, 25 మంది చీఫ్ సూపరిటెండెంట్లు, 25 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 70 హాల్ సూపరిటెండెంట్‌లు, 250 ఇన్విజిలేటర్లు విధుల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పేపర్- 1కు 5,031 మంది, పేపర్- 2కు 3,368 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రంలో సీసీటీవీ కెమెరా ఏర్పాట్లు చేశామని, నిమిషం ఆలస్యమైనా ఎంట్రీ ఉండదన్నారు. కార్యక్రమంలో రూట్ ఆఫీసర్లు జమ్లా నాయక్, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మి, పరీక్షల సహాయ కమిషనర్ రామేశ్వర్ ప్రసాద్, మండల విద్యాధికారి నీలకంఠం, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్ పాల్గొన్నారు.

ఆర్టీసీ అదనపు బస్సులు

మెదక్: నేడు జరగనున్న టెట్‌కు అభ్యర్థుల సౌకర్యార్థం అదనపు బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ సుధా తెలిపారు. రోజువారి సర్వీసులతోపాటు అదనంగా 10 బస్సులను ఎంజీబీఎస్, జేబీఎస్, పటాన్‌చెరు, సిద్దిపేట రూట్లలో నడుపుతున్నామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఓరియంటేషన్ ప్రోగ్రాం

మెదక్: సెన్సిటైజేషన్, ఓరియంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం ప్యానల్ లాయర్స్‌కు సీనియర్ సివిల్ జడ్జి జితేందర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైల్డ్ రైట్స్, విమెన్ యాక్ట్స్, సీనియర్ సిటిజన్స్ చట్టాలు, యాసిడ్ అటాక్స్, లీగల్ సర్వీసెస్ టు విక్టిమ్ ఆఫ్ యాసిడ్ అటాక్స్, ప్యానల్ లాయర్స్ విదులు తదితర అంశాలపై వివరించారు.

మాజీ సర్పంచ్ కన్నుమూత



దత్తారెడ్డి(ఫైల్)

తూప్రాన్: మండలంలోని రావెల్లి గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ సర్పంచ్ బూర్గుల దత్తారెడ్డి(103) గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈయన 1964–71 వరకు రావెల్లి, లింగారెడ్డిపల్లి ఉమ్మడి గ్రామపంచాయతీ రెండో సర్పంచ్‌గా కొనసాగినట్లు గ్రామస్తులు తెలిపారు. భార్య 15 రోజుల క్రితం మృతి చెందింది. దత్తారెడ్డి మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

అర్హులకే దళితబంధు ఇవ్వాలి

- దళితులు, బేడ బుడగ జంగాల డిమాండ్
- కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లి ఆందోళన

మెదక్ కలెక్టరేట్: అర్హులైన వారికి దళితబంధు వర్తింపజేయాలంటూ వెల్దుర్తి మండలం కుకునూర్‌కు చెందిన దళితులు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. గ్రామానికి చెందిన బేడ, బుడగ జంగాల కులస్తులు సైతం తమకు కూడా దళితబంధు అందించాలని కోరేందుకు కలెక్టరేట్‌కు వచ్చారు. ఈ క్రమంలో పోలీసులు వారిని కలెక్టరేట్ గేటు వద్ద అడ్డుకున్నారు. కలెక్టర్‌ను కలిసేందుకు అనుమతి ఇవ్వాలని దళితులు కలెక్టర్ పీఏ చాంబర్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి కాకుండా నిజమైన అర్హులను దళితబంధు అందించాలని దళితులు, తాము కూడా దళితులమేనని, మాకు కూడా పథకంలో ప్రాధాన్యం ఇవ్వాలని బుడగ జంగాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడంతో ఆందోళన తీవ్రమైంది. ఈ తరుణంలో మెదక్ డీఎస్పీ ఫణీంద్ర, పట్టణ, రూరల్ సీఐలు అక్కడికి చేరుకొని వారిని సముదాయించి కలెక్టర్ వద్దకు పంపించారు.

మేమూ దళితులమే..

దళితులంటే ఎస్సీలే కాదని, అందులో 57 ఉపకులాలు ఉన్నాయని బేడబుడగ జంగాల రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం, కార్యదర్శి మోహన్ పేర్కొన్నారు. బేడ బుడగజంగాలకు కూడా దళితబంధు ఇవ్వాలని కోరుతూ అదనపు కలెక్టర్ రమేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 13న బేడ బుడగ జంగాలపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి కోరినట్లు తెలిపారు.



కలెక్టర్ చాంబర్ వద్ద బైఠాయించిన దళితులు



కలెక్టరేట్‌లో బైఠాయించిన బేడ బుడగ జంగాలు

ధనప్రవాహం ఉండే స్థానాలేవీ?

- డబ్బులు ఎక్కువ పంపిణీ చేసేదెక్కడ..?
- సమస్యాత్మక నియోజకవర్గాలను గుర్తించండి
- జిల్లా కలెక్టర్లకు ఈసీ ఆదేశాలు
- కసరత్తు చేస్తున్న అధికార యంత్రాంగం



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఎన్నికల్లో డబ్బులు ఎక్కువగా పంపిణీ జరిగే అవకాశం ఉన్న నియోజకవర్గం ఏదీ..? జిల్లాలో ఎక్కువ మొత్తంలో ధన ప్రవాహం ఉండే అవకాశాలు ఉన్న స్థానం ఏదీ..? ఈ నియోజకవర్గాలను గుర్తించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈఏసీ (ఆర్థిక సమస్యాత్మక నియోజకవర్గాల) వివరాలను పంపాలని కలెక్టర్లకు ఆదేశాలు అందాయి. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు ఈ నియోజకవర్గాలపై దృష్టి సారించారు. ఇందుకోసం అంతర్గతంగా కసరత్తు చేస్తున్నారు. గతంలో జరిగిన పలు ఎన్నికల్లో పెద్ద మొత్తంలో డబ్బులు పట్టుబడిన ఘటనలు, ఇతర ఉదంతాల ఆధారంగా ఈ నియోజకవర్గాలను గుర్తించే పనిలో పడ్డారు. డబ్బులు పట్టుబడిన ఘటనలు ఎక్కడెక్కడ ఉన్నాయనే దానిపై సంబంధిత శాఖల అధికారులు ఆరా తీస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 11 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇందులో ధన ప్రవాహం అధికంగా ఉండే స్థానాలను గుర్తించడం అధికారులకు ఇప్పుడు కత్తిమీద సాముగా మారింది.

ఆ స్థానాల్లో..

అత్యధిక ధన ప్రవాహం ఉన్న నియోజకవర్గం అంటే పటాన్‌చెరు అనే భావన అందరిలో ఉంటుంది. మారుమూల నియోజకవర్గం నారాయణఖేడ్, రిజర్వుడ్ నియోజకవర్గాలు జహీరాబాద్, అందోల్‌లతో పోల్చితే పటాన్‌చెరు స్థానానికి పోటీ చేసే అభ్యర్థుల అనధికారిక ఖర్చు నాలుగింతలు ఉంటుందనేది బహిరంగ రహస్యం. ఎన్నికల సంఘానికి చూపే లెక్కలను పక్కన పెడితే.. ఇలాంటి నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఖర్చు తడిసి మోపెడవుతుంది. అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు కూడా ఇలాంటి నియోజకవర్గాల్లో ఆర్థికంగా బలమైన అభ్యర్థులనే రంగంలోకి దింపుతాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం ఏ నియోజకవర్గాలను ఈఏసీలుగా గుర్తిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

సాధారణమైపోయిన డబ్బుల పంపిణీ

ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేందుకు అభ్యర్థులు నగదు.. మద్యం ఏరులై పారిస్తుంటారు. ఏ ఎన్నికలు వచ్చినా ఓటర్లకు డబ్బుల పంపిణీ చేయడం సర్వ సాధరణమై పోయింది. ఎన్నికల్లో ధన ప్రవాహం ప్రతీసారి పెరిగిపోతూనే ఉంటోంది. దీనికి అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల సంఘం చేపడుతున్న చర్యలు ఆశించిన మేర ఫలితాలు ఇవ్వడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోలింగ్ సమయంలో వ్యయపరిశీలకుల నియామకం, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, నిఘా బృందాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నప్పటికీ ధన ప్రవాహానికి అడ్డుకట్ట పడటం సాధ్యం కావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఇలాంటి నియోజకవర్గాల గుర్తింపునకు ఎన్నికల సంఘం కసరత్తు చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

బ్యాంకర్ల నుంచి నివేదికలు

ఎన్నికల దగ్గర పడుతుండటంతో ఎక్కువ మొత్తంలో డబ్బులు డ్రా చేసిన ఖాతాదారుల వివరాలను గుర్తించాలని బ్యాంకర్లకు ఆదేశాలు అందాయి. ఏదైనా బ్యాంకు ఖాతా నుంచి ఎక్కువ సంఖ్యలో ఖాతాల్లో డబ్బులు వెళ్లాయా? అలాంటి లావాదేవీలకు సంబంధించిన వివరాలను గుర్తించి తమకు పంపాలని ఎన్నికల సంఘం బ్యాంకర్లను ఆదేశించింది. ఈ మేరకు బ్యాంకర్లు ఈ దిశగా చర్యలు చేపట్టారు. మొత్తం మీద ఉమ్మడి జిల్లాలో ఆర్థిక సమస్యాత్మక నియోజకవర్గాలుగా అధికారులు వేటిని గుర్తిస్తారనేది వేచి చూడాలి.

మెదక్ బంద్ ప్రశాంతం

- స్వచ్ఛందంగా దుకాణాల మూసివేత
- పీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ అరెస్టు



మెదక్ పట్టణంలో మూసి ఉన్న దుకాణాలు



బాలకృష్ణను అరెస్టు చేస్తున్న పోలీసులు

మెదక్: జిల్లాకు మెడికల్ కళాశాల ప్రకటించాలనే డిమాండ్‌తో పీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు వీధుల్లో ద్విచక్రవాహనాలపై తిరుగుతూ నినాదాలు చేశారు. వాణిజ్య, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూసివేసి మద్దతు తెలిపారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఉదయం 10గంటలకు పీసీసీ అధికార ప్రతినిధి బాలకృష్ణ కార్యకర్తలతో కలిసి రాందాస్ చౌరస్తాలో నిరసనకు దిగగా.. పోలీసులు ఆయనను అరెస్టు చేసి మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి 3గంటల పాటు ఉంచారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. బంద్‌కు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. పోరాటం ద్వారానే మెడికల్ కళాశాల సాధించుకుందామని, పార్టీలకతీతంగా ప్రజలు పాల్గొనాలని కోరారు. మంత్రి హరీశ్‌రావు మెదక్ అభివృద్ధికి అడ్డు తగులుతున్నారని, మూడుసార్లు ప్రకటించినా.. జాబితాలో మెడికల్ కళాశాల ఎందుకు లేదని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. ఆయనతో నాయకులు చౌదరి సుప్రబాత్‌రావు, రమేశ్‌రెడ్డి, చిన్నశంకరంపేట వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీలు ప్రసాద్, శివకుమార్, దొండస్వామి, నాయకులు సాల్మన్, అశోక్, గోవర్దన్, భూమన్న, తాక్యాస్వామి, భరత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీసీ కెమెరాల సిస్టం ధ్వంసంపై ఫిర్యాదు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో సీసీ కెమెరాలకు సంబంధించిన సిస్టం యూనిట్ ధ్వంసం విషయమై ఆలయ ఈఓ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారం క్రితం ఆలయంలో పని చేసే తాత్కాలిక ఉద్యోగులు బత్తిని నాగరాజు, రజనీకాంత్‌లు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం తమకు ఇవ్వాలంటూ పెట్రోలు పట్టుకుని ఆందోళన చేశారు. ఈ విషయంపై సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించేందుకు వెళ్లగా సిస్టం యూనిట్ ధ్వంసం చేసి ఉందని, దీనిపై విచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలని పోలీసులను కోరినట్లు ఈఓ తెలిపారు.

హత్య కేసు దర్యాప్తు ముమ్మరం

పటాన్‌చెరు టౌన్: మండల పరిధి ఇస్నాపూర్ శివారులో జరిగిన హత్య కేసు దర్యాప్తును పటాన్‌చెరు పోలీసులు వేగవంతం చేశారు. మృతుడు అబ్దుల్ నదీమ్ తాహెర్ సెల్‌ఫోన్‌కు ఎవరెవరి నుంచి ఫోన్‌లు వచ్చాయని, ఈ హత్యతో ఎవరికైనా ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉందా అనే వివరాలు సేకరిస్తున్నారు. కాల్ డేటా ఆధారంగా కూపీ లాగుతున్నారు. నిర్మల్ జిల్లా బైంసాకు చెందిన నదీమ్ పటాన్‌చెరులోని దాబాకు వచ్చిన సమయంలో ఎవరు రిక్కీ నిర్వహించారు.. ఎలా హతమార్చారు అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నామని, త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యమైన కేసు నమోదైంది. ఏఎస్‌ఐ అక్బర్‌ఖాన్ తెలిపిన వివరాలు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన హైమద్ షేక్ బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు వచ్చాడు. పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. బుధవారం ఉదయం పనికి వెళ్లిన హైమద్‌షేక్ తిరిగి ఇంటికి రాలేదు. అతని భార్య అమ్రిన్ భర్త కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె ఫిర్యాదు మేరకు గురువారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీసాతో దాడి.. కేసు నమోదు

కౌడిపల్లి(నర్సాపూర్): ఇంటికి వెళ్లేందుకు ఆటో కోసం ఎదురుచూస్తున్న ఒకరిపై బీరు సీసాతో దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కౌడిపల్లి ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెల్మకన్న గ్రామానికి చెందిన గుడిసె పోచయ్య గురువారం కౌడిపల్లి సంతలో కూరగాయలు కొనేందుకు వచ్చాడు. సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్లేందుకు స్థానిక ఓ వైన్స్ సమీపంలో ఆటో కోసం ఎదురుచూస్తున్నాడు. అక్కడే మద్యం మత్తులో ఉన్న కౌడిపల్లికి చెందిన పాత్‌లోత్ జగన్ దారిలో అడ్డుగా ఉన్నావని పోచయ్యతో గొడవ పడి తన చేతిలోని బీరు సీసాతో తలపై కొట్టాడు. పోచయ్యకు తీవ్రగాయం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

దాబా యజమానులకు జైలు, జరిమానా

సిద్దిపేటఅర్బన్: నిర్ణీత సమయం కంటే ఎక్కువగా దాబాలు తెరిచి ఉంచుతూ న్యూసెన్స్‌కు కారణమైన ముగ్గురు దాబా యజమానులకు జైలుశిక్ష, జరిమానా విధించినట్లు సిద్దిపేట త్రీటౌన్ సీఐ భానుప్రకాష్ గురువారం తెలిపారు. అర్ధరాత్రి దాటినా దాబాలను మూసివేయకుండా తెరిచి ఉంచడంతో మద్యం సేవించిన కస్టమర్లు గొడవ పడుతూ న్యూసెన్స్ చేస్తుండడంతో యజమానులపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి విచారించి వారికి ఒక్కొక్కరికి ఒక రోజు జైలు శిక్ష, రూ.600 జరిమానా విధించారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఓ వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా వేశారు.

తల్లీబిడ్డల సంరక్షణే లక్ష్యం

- నెలరోజులపాటు 'పోషణ్ అభియాన్'
- రోజువారీ కార్యక్రమాలు నిర్వహణ
- పెరటి తోటల పెంపకంపై అవగాహన
- మహిళా, శిశు సంక్షేమ శాఖ చర్యలు


పోషణ్ అభియాన్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం, మాతా శిశు సంరక్షణపై ఈ నెలాఖరు వరకు పోషణ్ అభియాన్ మాసోత్సవాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. నెలరోజులపాటు రోజువారీ ప్రత్యేక కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. గతంలో అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని పిల్లలకు అక్కడే పౌష్టికాహారం అందించి, విద్యాబుద్ధులు నేర్పేవారు. ఇప్పుడు చిన్నారుల ఎదుగుదల, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారం, పెరటి తోటల పెంపకం, తదితర అంశాలపై ప్రచారం చేస్తున్నారు.

2018 నుంచి ఏటా సెప్టెంబర్‌లో పోషణ్ అభియాన్‌పై దేశ వ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో గజ్వేల్, సిద్దిపేట, హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక ఐదు ప్రాజెక్టులు ఉన్నాయి. ఇందులో గర్భిణులు 6906, బాలింతలు 4926, మూడేళ్ల లోపు పిల్లలు 37902, మూడు నుంచి ఆరేళ్ల వరకు 28 వేల మంది పిల్లలు ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు మొత్తం 1149 ఉన్నాయి.

ప్రతి ఇంటికీ అంగన్‌వాడీ కార్యక్రమం

అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల బరువు ఎత్తును రోజువారీగా పరిశీలించి పోషకాల లోపం ఉన్న చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. తల్లి పాల ప్రాముఖ్యతపై ఇంటింటికీ అంగన్‌వాడీ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో నెలరోజుల పాటు పిల్లల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించి వారు ఏం తింటున్నారు.. ఎంత తింటున్నారు.. ఎన్నిసార్లు తింటున్నారు.. శరీరానికి ఏ రకమైన పోషకాలు అందుతున్నాయో తల్లిదండ్రులకు వివరించి చెప్పడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. పోషక విలువలున్న ఆహార పదార్థాలు ఆకుకూరలు ప్రొటీన్స్, విటమిన్స్ ఇతర బలవర్ధకమైన ఆహార పదార్థాలను ప్రదర్శిస్తూ చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నారు.

పెరటి తోటలకు శ్రీకారం

అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరటి తోటల పెంపకంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ఇఫ్కో, కృషి విజ్ఞాన కేంద్రాల సహకారంతో ఆయా కేంద్రాలకు ఉచితంగా కూరగాయల విత్తన ప్యాకెట్లు అందిస్తున్నారు. ఈ నెలాఖరులోగా అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో పెద్ద ఎత్తున కూరగాయలు, ఆకుకూరల సాగుతో పాటు పండ్ల మొక్కలు నాటనున్నారు.

ఇంటింటికీ అంగన్‌వాడీ కార్యక్రమం

తల్లీబిడ్డల సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ఇంటింటికీ అంగన్‌వాడీ కార్యక్రమాన్ని చేపడుతుంది. పోషణ్ అభియాన్ మాసోత్సవంలో భాగంగా పిల్లల ఎదుగుదల, తల్లిబిడ్డల క్షేమం తదితర వివరాలు తెలుసుకునేందుకు అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. పిల్లలకు టీకాలు వేయడం, బరువు చూడడం, గర్భిణుల బరువు చూడటం, ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తాం, అలాగే పెరటి తోటల పెంపకంపై అవగాహన కల్పించి ఏర్పాటు చేస్తాం. పోషణ్ అభియాన్‌పై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

– వెంకటరాజమ్మ, సీడీపీఓ, గజ్వేల్

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

సిద్దిపేట సీపీ శ్వేత



సిద్దిపేటకమాన్: రాబోయే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా సమన్వయంతో పని చేయాలని సీపీ శ్వేత పోలీసు అధికారులకు సూచించారు. సీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నికల నియమావళి, కోడ్ ఆఫ్ కండక్ట్, ఈవీఎం వీవీ ప్యాడ్ భద్రత గురించి సీపీ వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. సోషల్ మీడియాలో అనవసర పోస్టులు చేయకూడదని సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్‌లో భాగంగా ఈ పెట్టి కేసులు నమోదు చేయాలని సూచించారు. ప్రీపోల్, పోలింగ్ డే, ఆఫ్టర్ పోలింగ్ తదితర అంశాల గురించి అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాసరావు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమావేశంలో సిద్దిపేట ఏసీపీ కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, వన్ టౌన్ సీఐ కృష్ణారెడ్డి, టూటౌన్ సీఐ రవికుమార్, త్రీ టౌన్ సీఐ భానుప్రకాష్, రూరల్ సీఐ చేరాలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీ శ్వేత, హాజరైన పోలీసు అధికారులు

గణేష్ మండపాల వివరాలు నమోదు చేయాలి

సిద్దిపేటకమాన్: గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ వారు రూపొందించిన పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సిద్దిపేట సీపీ శ్వేత తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. http://policeporta.trpolice.gov.inలో వివరాల నమోదు ద్వారా భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీసులకు సులువుగా ఉంటుందని తెలిపారు. సందేహాలు ఉంటే డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 8712667100కు సమాచారం అందించాలని సూచించారు.

కల్తీ పెట్రోల్ పోశారని ఆందోళన

గజ్వేల్‌రూరల్: బంకులో కల్తీ పెట్రోల్ పోశారంటూ వాహనదారులు ఆందోళనకు దిగిన సంఘటన గజ్వేల్‌లో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ నుంచి గజ్వేల్‌కు వెళ్లే మార్గమధ్యలో ఉన్న హెచ్‌పీ పెట్రోల్‌బంక్‌లో కొందరు వాహనదారులు పెట్రోల్ పోయించుకున్నారు. కొద్ది దూరం వెళ్లిన తర్వాత వాహనాలు ఆగిపోవడంతో తిరిగి పెట్రోల్ బంక్ వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. బంకులో కల్తీ పెట్రోల్ పోయడం వల్లే వాహనాలు ఆగిపోయాయని సిబ్బందితో గొడవకు దిగారు. ఇదే సమయంలో బాటిళ్లలో పెట్రోల్ పోయించగా నీరుగా రావడంతో బంకు సిబ్బందిని ప్రశ్నించారు. పెట్రోల్‌లో కొత్తరకం కెమికల్స్‌ను కలపడం జరిగిందంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని వాహనదారులు ఆరోపించారు. పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోరాట యోధుడు సర్వాయి పాపన్న


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

ములుగు(గజ్వేల్): బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధి సింగన్నగూడలో ఉపసర్పంచ్ స్వామిగౌడ్, గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాపన్నగౌడ్ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఆనాటి నిరంకుశ రాజరిక పోకడలకు వ్యతిరేకంగా పాపన్న పోరాడిన తీరు గొప్పదని అన్నారు. ఆయన అడుగు జాడల్లో యువత ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిలి వెంకన్నగౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్, అంజిరెడ్డి, జుబేర్‌పాష, బాలక్రిష్ణ, చంద్రగౌడ్, నాగులు, అంజై, మురళిగౌడ్ పాల్గొన్నారు.

కేసీఆర్ చర్లపల్లి జైలుకు వెళ్లడం ఖాయం

పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య


మాట్లాడుతున్న పొన్నాల లక్ష్మయ్య

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రజలు తిరగబడే రోజులు దగ్గర పడ్డాయని, ధరణి మొత్తం అవినీతిమయమని పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ఆరోపించారు. గురువారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రధాని, హోంమంత్రిపై ఆరోపణలు చేసినా కేసీఆర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మేం అధికారంలోకి వస్తే కేసీఆర్ ఎర్రవెల్లి నుంచి చర్లపల్లి జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. ఇదే విషయాన్ని తాను 2014 కూడా చెప్పినట్లు గుర్తు చేశారు. ప్రతిపక్షాలను కేసీఆర్ మాట్లాడనీయడం లేదని విమర్శించారు. మోదీ పాలన విభజించి పాలించు తరహాలో ఉందన్నారు. దేశానికి దిశానిర్దేశం చేయడానికి సోనియాగాంధీ ఈనెల 17న హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం

గజ్వేల్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని పొన్నాల లక్ష్మయ్య అన్నారు. గురువారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ నేతలు కమీషన్ల కోసం పనిచేశారే తప్ప.. పేదలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. సమావేశాల్లో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, పీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, నాయకులు గొల్లపల్లి నరేందర్‌రెడ్డి, తాడూరి శ్రీనివాస్ గౌడ్, గంప మహేందర్, గూడూరు శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

లారీ కిందపడి మహిళకు తీవ్రగాయాలు


లారీ టైర్ల కింద పడిపోయిన చంద్రకళ

గజ్వేల్‌రూరల్: ఓ మహిళ లారీ కిందపడి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం గజ్వేల్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. వడ్డెర చంద్రకళ, నరేష్ దంపతులు లక్ష్మీప్రసన్ననగర్‌లో నివాసముంటున్నారు. బస్టాండ్ సమీపంలో తమ కుటుంబ సభ్యులతో ఉన్న చంద్రకళ ప్రజ్ఞాపూర్ నుంచి తూప్రాన్ వైపు వెళ్తున్న స్క్రాప్ లారీ కింద పడిపోయింది. దీంతో లారీ టైర్లు ఆమె కాళ్లపై నుంచి పోవడంతో తీవ్రగాయాలయ్యాయి. బాధితురాలిని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చోరీకి విఫల యత్నం

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట ఓ వ్యక్తి చోరీకి విఫల యత్నం చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. మద్దూరు మండలం నర్సాయపల్లికి చెందిన గండె వేణు పట్టణ కేంద్రంలో ఉంటున్నాడు. గురువారం బ్యాంకు నుంచి నగదు విత్‌డ్రా చేసి తన ఎలక్ట్రిక్ బైక్ డిక్కీలో పెట్టడాన్ని ఓ గుర్తు తెలియని వ్యక్తి గమనించాడు. వేణు పక్కకు వెళ్లింది గమనించి బండి డిక్కీని తెరిచేందుకు ప్రయత్నించాడు. అది తెరుచుకోకపోవడంతో వెళ్లిపోయాడు. ఈ తతంగమంతా పక్కనే ఉన్న మార్ట్ లోని సీసీ టీవీలో రికార్డు అయింది. డిక్కీ తాళం ఎవరో తెరవడానికి యత్నించినట్లు గుర్తించిన వేణు పక్కనే ఉన్న మార్ట్ సీసీ కెమెరాలను పరిశీలించగా విషయం బయటకు వచ్చింది. ఈ విషయమై స్థానిక ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డిని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.


డిక్కీ తెరిచేందుకు యత్నిస్తున్న వ్యక్తి (వృత్తంలో)

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

ఆర్‌బీఐ జిల్లా లీడు మేనేజర్ తన్యా సింగ్మా


మాట్లాడుతున్న తన్యా సింగ్మా

హుస్నాబాద్‌రూరల్: మహిళలు కలిసికట్టుగా ఆర్థిక ప్రగతి వైపు అడుగులు వేయాలని ఆర్‌బీఐ జిల్లా లీడు మేనేజర్ తన్యా సింగ్మా అన్నారు. గురువారం ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా పోతారం(ఎస్) స్వశక్తి స్త్రీశక్తి కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఆయన పరిశీలించి, వారి వ్యాపారం గురించి తెలుసుకున్నారు. కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధితో పాటు ఆదాయం సమకూరుతుందన్నారు. మహిళలకు కావాల్సిన రుణాలను బ్యాంకులు లింకేజీ ద్వారా అందిస్తాయని, ఇప్పటికే రూ.10లక్షల నుంచి రూ.20లక్షల వరకు రుణాలు ఇస్తున్నాయని అన్నారు. వ్యాపార అభివృద్ధి జరిగితే మీ ఇంటి వద్దకే బ్యాంకు అధికారులు వచ్చి రుణాలు ఇచ్చిపోతారని చెప్పారు. జిల్లాలోని 30 వేల వరకు స్వశక్తి గ్రూపులు ఉన్నప్పటికీ రూ.20లక్షల బ్యాంకు లింకేజీ తీసుకునేందుకు ముందుకు రావడం లేదన్నారు. బ్యాంకు అధికారులు మహిళలకు ఆర్థిక ప్రగతి పై అవగాహన కల్పించి రుణాలు ఇవ్వాలని చెప్పారు. లీడు బ్యాంకు మేనేజర్ సత్యజీత్ మాట్లాడుతూ.. పరిశ్రమలు, ప్రభుత్వ సబ్సిడీ రుణాలను పొందే ఏ పథకం తీసుకున్నా 15 రోజుల్లో సబ్సిడీ వస్తుందని చెప్పారు. బయటి వ్యాపారుల దగ్గరికి అప్పు కోసం వెళ్లకుండా బ్యాంకుల్లోనే రుణాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ అరుణ్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ సుష్మ, సర్పంచ్ బత్తిని సాయిలు, సీఏ బోయిని కనకతార, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాలు. పటాన్‌చెరు మండలం కర్దనూర్ శివారులోని ఓఆర్‌ఆర్ పై గుర్తుతెలియని వ్యక్తి (25 నుంచి 30 ఏళ్ల వయసు) గురువారం రోడ్డు దాటుతుండగా వెలిమెల వైపు నుంచి ముత్తంగి వైపు వస్తున్న వాహనం ఢీ కొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న బీడీఎల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి చేతి పై త్రిశూలం టాటూ ఉంది. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ, కారు ఢీ.. నలుగురికి గాయాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): లారీని కారు ఢీకొట్టడంతో నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని రామునిపట్ల వద్ద రాజీవ్‌రహదారిపై గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు. హైదరాబాద్ నుంచి అఫ్జల్ ఖాను, తాయబ్ ఉన్నీసా, సయ్యద్ ఎర్షద్, సయ్యద్ వాజీబ్‌లు కారులో కరీంనగర్ వెళ్తున్నారు. ముందుగా వెళ్తున్న లారీ రామునిపట్ల వద్ద ఒక్కసారిగా ఎడమవైపునకు తిప్పి రోడ్డు క్రాస్ చేయడంతో కారు అదుపుతప్పి ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సీసీ కెమెరాల బిగింపునకు స్థల పరిశీలన

గౌరవెల్లి ప్రాజెక్టును సందర్శించిన అధికారులు


గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద గోదావరి నదీ యాజమాన్య బోర్డు, పర్యావరణ అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామం వద్ద నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు గురువారం సాయంత్రం గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్‌ఎంబీ), కేంద్ర పర్యావరణ శాఖ అధికారులు స్థలాలను పరిశీలించారు. అయితే 1.41టీఎంసీలు తీసుకునేందుకు అనుమతులు ఉండగా, దాని సామర్థ్యాన్ని 8.23టీఎంసీలకు పెంచారని సవాల్ చేస్తూ ముంపు గుడాటిపల్లి భూ నిర్వాసితులు బద్దం భాస్కర్‌రెడ్డితో పాటు పలువురు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ)ను ఆశ్రయించారు. ఈ క్రమంలో ఇటీవల ఎన్జీటీ అనుమతులు పొందే వరకు నిర్మాణ పనులు చేయొద్దని, గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద సీసీ కెమెరాలు బిగించాలని గోదావరి బోర్డుకు ఎన్జీటీ ఆదేశించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అధికారులు ప్రాజెక్టును సందర్శించి, కట్టపై ఎక్కడెక్కడా సీసీ కెమెరాలు బిగించాలని స్థలాలను పరిశీలించి వెళ్లారు. వీరి వెంట ప్రాజెక్టు ఈఈ రాములునాయక్‌తో పాటు సంబంధిత అధికారులు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

శ్రీ రామ్ గోల్డ్ మీ బంగారం తాకట్టులో ఉందా? వడ్డీ చెల్లించ లేకపోతున్నారా? తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ :9133214214 [H-788626]

DISTRIBUTORS

Wanted District Wise Stockists for European Sofa Fabrics, Wallpapers. Call: 9182931347 [QA-5920]

WANTED

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీతం: 18K. ఏజెంట్ కమీషన్ 3K Ph: 9848571888 [H-189332]

హైదరాబాద్‌లో ఇంట్లో ఉండి వంటపనికి సీనియర్ సిటిజన్‌ను చూసుకోవటానికి 40-55 వయస్సు గల 10th చదివిన మగ మనిషి కావలెను. Ph: 7207914195 [H-781280]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పంటలు పండక.. అప్పులు తీర్చలేక..


శ్రీను (ఫైల్)

రాయపోలు(దుబ్బాక): ఆర్థిక ఇబ్బందులతో యువరైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయపోలు మండలం ఎల్కల్‌లో చోటుచేసుకుంది. బేగంపేట ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన పిట్ల శ్రీను (34) వ్యవసాయం చేస్తుంటాడు. నాలుగైదేళ్లుగా అప్పులు చేసి వ్యవసాయ భూమిలో బోర్లు వేయించాడు. పంటలు కూడా సరిగా పండకపోవడంతో అప్పులు ఇచ్చిన వారు వేధించడం మొదలు పెట్టారు. మనస్తాపానికి గురైన శ్రీను బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు అతన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తుండగా గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుని భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆరోగ్య సమస్యతో..


రామవ్వ(ఫైల్)

దుబ్బాకరూరల్: ఆరోగ్య సమస్యతో ఓ వృద్ధురాలు పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలం తాళ్లపల్లిలో జరిగింది. ఎస్‌ఐ భువనేశ్వర్‌రావు తెలిపిన వివరాలు. టేకులపల్లి రామవ్వ(68) ఐదేళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఉంది. ఆ బాధ భరించలేక పురుగుల మందు తాగింది. వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి అల్లుడు రాంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో..


శివ మృతదేహం

వట్‌పల్లి(అందోల్): కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఓ వ్యక్తి చెరువులో దూకి మృతి చెందిన ఘటన గురువారం జోగిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ గైబప్ప తెలిపిన వివరాలు. గోషామహల్, మంగళ్‌హాట్‌లోని ఇందిరా కాలనీకి చెందిన బసంత్‌పురే శివ(32) ఈనెల 12న కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గురువారం అందోల్ పెద్ద చెరువు అలుగు వద్ద ఓ వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడ లభించిన ఆధారాలతో అది శివ మృతదేహంగా పోలీసులు గుర్తించారు. మృతుడి అన్న రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..


పోచయ్య (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని లింగంపల్లిలో జరిగింది. గురువారం కౌడిపల్లి ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలు. మండలంలోని కొట్టాల గ్రామ పంచాయతీ పరిధిలోని లింగంపల్లికి చెందిన పిచ్చకుంట పోచయ్య(54) వ్యవసాయం, ఇంటి నిర్మాణానికి మొత్తం రూ.5లక్షలకు పైగా అప్పు చేశాడు. అవి తీర్చే మార్గంలేక బుధవారం వెల్మకన్న గ్రామశివారులో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం కొడుకు దశరథ్‌కు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే పోచయ్యను సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ అల్వాల్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఊబచెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధిలోని ఊబచెరువులో గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైంది. ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించాడా లేక ఆత్మహత్య చేసుకున్నాడా అనే వివరాలు తెలియాల్సి ఉంది. మృతుడి వయసు సుమారు 35 సంవత్సరాలు ఉంటాయి. శవం పూర్తిగా కుళ్లిపోయి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహాధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కల్లుగీత కార్మికులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి అన్నారు. ఈ నెల 22న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను గురువారం సిద్దిపేటలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వారందరికీ సేఫ్టీ మోకులు, ద్విచక్ర వాహనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2023–24 రాష్ట్ర బడ్జెట్‌లో గీత కార్మికులకు కేటాయించిన నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కోహెడ కొటమురయ్య గౌడ్, జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్, నర్సింహులు, కుమార్, కనకయ్య, కనకరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.